# కేబుల్ అన్‌బండ్లింగ్‌కు అంగీకరించండి - గ్రామీణ సర్వీసుల నష్టాలకు సబ్సిడీ ఇస్తాం - బిఎస్ఎన్ఎల్ పై డిఓటి కుట్ర

టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సిఫార్సుల ప్రకారం యాక్సెస్ డెఫిసిట్ ఛార్జీల రద్దు వల్ల బిఎస్ఎన్ఎల్‌కు కలిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి యూనివర్సల్ సర్వీసు ఆబ్లిగేషన్ ఫండ్‌ను వాడుకోరాదు. ఈ సిఫార్సు ఆధారంగా గ్రామీణ ప్రాంతాలలో 1.4.2002 కంటే ముందు వున్న లాండ్‌లైన్ల సంఖ్య ఆధారంగా సంవత్సరానికి 2000 కోట్లు బిఎస్ఎన్ఎల్‌కు మూడు సంవత్సరాల పాటు చెల్లించారు. ఈ చెల్లింపులు జులై 2011 నాటికి పూర్తవుతాయి.

అయితే గ్రామీణ ప్రాంత సర్వీసుల నిర్వహణ మూలంగా సంవత్సరానికి 9306 కోట్లు నష్టం వాటిల్లుతోందనీ, కనుక ఈ నష్టాలను భరించడానికి ప్రభుత్వ సహాయం కొనసాగించాలనీ బిఎస్ఎన్ఎల్ కోరింది. దీనిపై విస్తృతంగా చర్చించిన అనంతరం ప్రభుత్వం మరియు టెలికం కమీషను పై డిమాండ్‌ను తిరస్కరిస్తూ అందుకు ఈ క్రింది కారణాలను పేర్కొంది.

## ప్రభుత్వ వాదన

అ) బిఎస్ఎన్ఎల్‌లోని లాండ్‌లైన్ల నెట్‌వర్క్ అంతా డిపార్టుమెంట్ ఆఫ్ టెలికాం కాలంలో మొత్తం ఖర్చు డిఓటి చేసి నెలకొల్పబడింది.

ఆ) గ్రామీణ ప్రాంత టెలిఫోన్ల నిర్వహణ కోసం ఎడిసి ఛార్జీల ద్వారా మరియు యుఎస్ఓ ఎఫ్ ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు సబ్సిడీలు అందించబడ్డాయి.

ఇ) 31.3.2011 నాటికి యుఎస్ఓ ఫండ్ ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు వివిధ గ్రామీణ ప్రాంత సేవల కోసం 9139 కోట్లు అందించ బడ్డాయి.

ఈ) 28,000 గ్రామాలలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇవ్వడం కోసం బిఎస్ఎన్ఎల్‌యు యుఎస్ఓ ఫండ్ ద్వారా 1500 కోట్లు సబ్సిడీగా ఇవ్వబడింది.

ఉ) ఇలా అనేక రకాలుగా సబ్సిడీలు అందించినా గ్రామీణ ప్రాంత లాండ్‌లైన్లు తగ్గడానికి కారణం, బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సర్వీసుల నాణ్యతా లోపాలే కారణం. అలాగే మొబైల్ రంగం తక్కువ ధరలకే అందుబాటులోకి రావడం కూడా మరో కారణం.

ఊ) 1.4.2002 నాటికి గ్రామీణ ప్రాంతాలలో వున్న 90 లక్షల లాండ్ కనెక్షన్లకు నెలకు రూ. 214 చొప్పున సంవత్సరానికి 2000 కోట్లు బిఎస్ఎన్ఎల్‌కు చెల్లించడం జరిగింది. నవంబరు 2008 నాటికి గ్రామీణ ప్రాంత లాండ్ కనెక్షన్లు 36.5 లక్షలు డిస్కనెక్టు అయినా సబ్సిడీ 7/11 దాకా చెల్లించడం జరిగింది.

ఎ) అనేక విధాలుగా సబ్సిడీలు బిఎస్ఎన్ఎల్‌కు అందించినా 3/11 నాటికి బిఎస్ఎన్ఎల్‌కు 30 లక్షల గ్రామీణ లాండ్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి.

ఏ) యూనివర్సల్ సర్వీసు ఆబ్లిగేషన్ ఫండ్ నిబంధనల ప్రకారం యుఎస్ఓ ఫండ్ నిధులు గ్రామీణ ప్రాంత టెలికం అభివృద్ధికి తోడ్పడాలి కానీ, ఏదైనా టెలికం కంపెనీకి కాదు.

ఐ) యాక్సెస్ డెఫిసిట్ ఛార్జీల చెల్లింపు నాటికి ఇప్పటికి మార్కెట్ పరిస్థితులు వేరు. 2002లో గ్రామీణ టెలిసాంద్రత 1.2% కాగా ప్రస్తుత టెలిసాంద్రత 33%. మార్చి 2011 నాటి లెక్కల ప్రకారం ఎక్కువమంది గ్రామీణులు మొబైల్‌నే వాడుతున్నారు. ఇందులో 88% ప్రైవేటు టెలికం కంపెనీలవే.

ఒ) గ్రామీణ ప్రాంతాలలోని ఎక్ఛేంజీల ద్వారా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇవ్వగలం. దీనికోసం యుఎస్ఓ ఫండ్ ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు సబ్సిడీ అందుతోంది. 30.4.2011 నాటికి బిఎస్ఎన్ఎల్ 2.68 లక్షల కనెక్షన్లను, 4368 కె10 ఎస్‌కెఎస్‌లను ఏర్పాటు చేసింది. దీని ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు 115.77 కోట్లు సబ్సిడీ లభించింది. అయితే వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న ఈ సర్వీసుల పట్ల సంతృప్తికరంగా లేరు.

ఓ) గ్రామీణ ప్రాంతంలోని తమ నెట్‌వర్క్ వినియోగం ద్వారా సంతృప్తికరమైన సేవలను బిఎస్ఎన్ఎల్ అందించలేకపోతే ప్రైవేటు టెలికం కంపెనీలకు తమ నెట్‌వర్క్‌ను అందించడం ద్వారా, బిఎస్ఎన్ఎల్ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి వుంది.

ఔ) పై అంశాలను దృష్టిలో వుంచుకొని గ్రామీణ ప్రాంత సర్వీసుల నిర్వహణ కోసం బిఎస్ఎన్ఎల్‌కు అందిస్తున్న సబ్సిడీ పై పునరాలోచించాల్సిన అవసరం వుంది. తన నెట్‌వర్క్‌ను ప్రైవేటు టెలికం కంపెనీలకు పంచే అంశాన్ని బిఎస్ఎన్ఎల్ అంగీకరిస్తే అప్పుడు సబ్సిడీ అంశం పరిశీలించవచ్చు.

అం) బిఎస్ఎన్ఎల్ సమర్పించిన లెక్కలలో విద్యుత్తు, ఆయిల్, పవర్ మరియు నెట్‌వర్క్ ఖర్చులనే పరిగణనలోక తీసుకోవాలని ట్రాయ్ నిర్ణయించింది. ఉద్యోగుల ఖర్చు, నిర్వహణ వ్యయాలను, లైసెన్సు ఫీజు తదితరాలను పరిగణనలోకి తీసుకోవడాన్ని తిరస్కరిస్తున్నాం.

పై అంశాలను పరిశీలించి బిఎస్ఎన్ఎల్ తన నివేదికను తిరిగి సమర్పించాల్సిందిగా కోరుతున్నాం.

### *బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ వాదన*

అ) గ్రామీణ ప్రాంతాలలో టెలికం సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో దేశంలోని దాదాపు ఆరు లక్షల గ్రామాలలో 5.5 లక్షల గ్రామాలకు టెలికం సౌకర్యాలను బిఎస్ఎన్ఎల్ అందిస్తోంది.

ఆ) ప్రైవేటు టెలికం కంపెనీలు గ్రామీణ ప్రాంతాలలో సేవలు అందించడానికి నష్టాలను సాకుగా చూపిస్తూ, లైసెన్సు నిబంధనలను ఉల్లంఘించి, నామమాత్రపు ఫైనుతో బయటపడ్డాయి.

ఇ) గ్రామీణ ప్రాంతాలలో బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పన కోసం కొన్ని ప్రైవేటు టెలికం కంపెనీలు తిరస్కరించి, అందుకోసం అపరాధ రుసుం చెల్లించి, దీనివల్ల తమకు నష్టం వస్తుందని డిఓటికి రాతపూర్వకంగా తెలియజేశాయి.

ఈ) యూనివర్సల్ సర్వీసు ఆబ్లిగేషన్ ఫండ్ నుండి గ్రామీణ ప్రాంతాలలో వివిధ టెలికం కంపెనీలు అందించే సేవలకుగానూ సబ్సిడీలు ఇవ్వడం జరుగుతోంది.

ఉ) యుఎస్ఓ ఫండ్ నుండి లభించే సబ్సిడీ కంటే కూడా గ్రామీణ టెలికం సర్వీసుల వల్ల బిఎస్ఎన్ఎల్‌కు నిరంతర నష్టాలు వస్తూనే వుంటాయి. ఎందుకంటే గ్రామీణ ప్రాంత సర్వీసుల నిర్వహణ వ్యయం ఎక్కువగానూ, ఆదాయం తక్కువగానూ వుంటుంది.

ఊ) ఎక్కడి నుండైనా, ఎప్పుడైనా మొబైల్ నుండి సేవలు స్వీకరించే అందుబాటు మరియు వీడియో, రేడియో, మ్యూజిక్ లాంటి అదనపు సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల లాండ్ లైన్ల పై మోజు తగ్గి డిస్కనెక్షన్ అవుతున్నాయి. బిఎస్ఎన్ఎల్ అందించే సర్వీసుల నాణ్యతా లోపం ప్రధాన కారణం కాదు.

ఎ) బిఎస్ఎన్ఎల్‌గా రూపాంతరం చెందే సమయంలో ఎడిసి ఛార్జీల చెల్లింపు, లైసెన్సు ఫీజు మినహాయింపు లాంటి, అనేక ఆకర్షణీయమైన హామీలు ఇచ్చి, ఆ తర్వాత వాటిపై ప్రభుత్వం మాట మారుస్తోంది. దీనికి విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడిదారుల, ప్రైవేటు టెలికం కంపెనీల ఒత్తిడే కారణం.

ఏ) యుఎస్ఓ ఫండ్ గ్రామీణ లాండ్ కనెక్షన్ల వెసులుబాటు కోసమే ఏర్పాటుకాగా ప్రైవేటు టెలికం కంపెనీల ఒత్తిడికి లొంగి, గ్రామీణ మొబైల్ సేవలకు కూడా సబ్సిడీలు అందిస్తున్నారు.

ఐ) భారతదేశంలోని కేబుల్ నెట్‌వర్క్‌ను విదేశీ అభివృద్ధి చెందిన దేశాలు ప్రస్తుతం వేయాలంటే కనీసం 20 సం॥లు పడుతుంది.

ఒ) వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌ను ఎంతమంది వినియోగదారులు వాడటం ఎక్కువవుతుందో బ్రాడ్‌బ్యాండ్ స్పీడు అంత తగ్గుతుంది. కాగా బిఎస్ఎన్ఎల్ లాండ్‌లైన్ ద్వారా బ్యాండ్ బ్యాండ్‌కు ఫోర్ట్ బైండింగ్ ప్రక్రియ ద్వారా వేగం తగ్గకుండా చేస్తారు. అందుకనే ఇండియాలోని బ్రాడ్‌బ్యాండ్ల కనెక్షన్లలో 70% బిఎస్ఎన్ఎల్ కనెక్షన్లే. అందువల్లనే బిఎస్ఎన్ఎల్ కేబుల్ నెట్‌వర్క్‌ని ఎలాగైనా ప్రైవేటు టెలికం కంపెనీలకు అప్పగించాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోంది.

ఓ) గ్రామీణ ప్రాంత ఎక్స్చేంజీల నిర్వహణ కోసం సగటున బిఎస్ఎన్ఎల్‌కు నెలకు 50,000కు పైగా ఖర్చు అవుతూ ఉంటే, ఒక్కో గ్రామీణ ప్రాంత కనెక్షను ద్వారా కేవలం నెలకు రూ. 50 ఆదాయం వుంది. కాగా బడా పెట్టుబడిదారులకు లొంగిపోయిన ప్రభుత్వం, ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ వ్యయాలను ఖర్చులలో కలుపకూడదని నిబంధన విధించింది.

ఔ) 1999 నాటి నూతన టెలికం విధానం ప్రకారం బిఎస్ఎన్ఎల్‌కు లైసెన్సు ఫీజు నుండి మినహాయింపు ఇవ్వవలసి వుంది. కానీ ఇటీవలి బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ యాక్సెస్ (బిడబ్ల్యుఎ), 3జి స్పెక్ట్రమ్ కేటాయింపులలో ప్రభుత్వం తను ప్రకటించిన నిబంధనలకు విరుద్ధంగా బిఎస్ఎన్ఎల్ నుండి 18500 కోట్లు అక్రమంగా ముక్కు పిండి వసూలు చేశారు.

అం) కేబుల్ నెట్‌వర్క్‌ను ప్రైవేటు టెలికం కంపెనీలతో పంచుకుంటేనే సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడం బట్టతలకీ మోకాలికీ ముడి పెట్టడమే.

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**
**ఆంధ్రప్రదేశ్ సర్కిల్**